
మాట్లాడుతున్న బొలిశెట్టి శ్రీనివాస్

వైసీపీ పేటీఎం బ్యాచ్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 27 : టీడీపీ-జనసేన సీట్ల కేటాయింపుపై వైసీపీ పేటీఎం బ్యాచ్ చేసే దుష్ప్రచారాన్ని జన సైనికులు, వీరమహిళలు తిప్పికొట్టాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు సభా ప్రాంగణం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో వైసీపీ పేటీఎం బ్యాచ్ పొత్తుపై దుష్ప్రచారం చేస్తున్నదని, అంతే దీటుగా మన నాయకుడికి మద్దతుగా నిలుద్దామన్నారు. 2009 నుంచి పవన్ ఏమీ ఆశించకుండా ప్రజల కోసం పనిచేస్తున్నారని అన్నారు. తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రజల శ్రేయస్సు కోసం త్యాగాలు చేయాల్సి వస్తే చేద్దామని పిలుపునిచ్చారు. మల్లినీడి బాబి మాట్లాడుతూ తన స్వార్థం చూసుకోకుండా రాష్ట్ర భవిష్యత్ కోసం పవన్ కల్యాణ్ పనిచేస్తున్నారని అది మనమంతా గుర్తించి బాధ్యత పంచుకోవాలన్నారు. జనసేన ఇన్‌చార్జ్‌లు చిలకం మధుసూధనరెడ్డి, చాగంటి మురళీకృష్ణ, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.


వేదికపై ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్


సభా వేదిక వద్ద మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

జెండా ఎగరేద్దాం !

నేడే టీడీపీ-జనసేన తెలుగు జన విజయకేతన సభ

- తొలి ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు, పవన్ హాజరు
- చలో తాడేపల్లిగూడెంకు లక్షలాది మంది రాక
- బస్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరణ
- బైక్‌లు, కార్లలో వచ్చేందుకు అభిమానుల ఏర్పాట్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి/పెంటపాడు/తాడేపల్లిగూడెం రూరల్)

సార్వత్రిక ఎన్నికలకు తెలుగుదేశం-జనసేన కూటమి ఎన్నికల శంఖారావం పూరించనుంది. పొత్తులు అనంతరం తొలిసారిగా రాష్ట్ర నడిబొడ్డునవున్న తాడేపల్లిగూడెంలో ఉమ్మడి సభ నిర్వహించనున్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు జాతీయ రహదారికి ఆనుకుని వున్న 25 ఎకరాల భూమిలో సభా ప్రాంగణం సిద్ధమైంది. సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్‌లు హాజరవుతున్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు ప్రణాళికను ప్రకటించనున్నారు. సభకు 'తెలుగు జన విజయకేతనం' అని పేరు పెట్టారు. సభా వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో కూడిన భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కూటమి అధినేతలు ఇద్దరు సభకు హాజరు కానుండడంతో ఇరు పార్టీలో మంచి జోష్ నెలకొంది. అంచనాలకు మించి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరవుతారని భావిస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా సభ విజయవంతానికి ఇరు పార్టీల నాయకులు కసరత్తు పూర్తి చేశారు. సభా ప్రాంగణాన్ని బ్లాక్‌లుగా విభజించారు. మహిళల కోసం ప్రత్యేకంగా బ్లాక్‌లు కేటాయించారు. సభ సక్రమంగా సాగేందుకు దాదాపు వెయ్యిమంది వలంటీర్లను నియమించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం 500 మంది వలంటీర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం ముఖ్య నాయకులు అచ్చెన్నాయుడు, ప్రత్తిపాటి పుల్లారావు, జనసేన రాష్ట్ర నేత నాదెండ్ల మనోహర్‌లు మంగళవారం సభా ప్రాంగణాన్ని సందర్శించారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, క్రమశిక్షణ సంఘం ప్రతినిధి మల్లినీడి బాబి, తాడేపల్లిగూడెం టీడీపీ, జనసేన ఇన్‌చార్జ్‌లు వలవలబాబ్జి, బొలిశెట్టి శ్రీనివాస్‌లు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు.

పశ్చిమ నుంచే భారీగా

భారీ బహిరంగ సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి అధిక సంఖ్యలో ప్రజలు హాజరుకానున్నారు. నాలుగు రోజుల నుంచి ఇరు పార్టీల నాయకులు నియోజకవర్గాల్లో పర్యటించారు. తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు, భీమవరం, పాలకొల్లు, నిడదవోలు, ఆచంట, గోపాలపురం, పాలకొల్లు నుంచి భారీగా ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి కనిష్ఠంగా పది వేల మంది తరలి వచ్చేలా ప్రణాళిక చేశారు. తాడేపల్లిగూడెంలో రెండు పార్టీలు ప్రత్యేకంగా కసరత్తు చేశాయి. తెలుగుదేశం నుంచే 25 వేల మంది హాజరయ్యేలా వాహనాలు సిద్ధం చేశారు. జనసేన భారీ బైక్ ర్యాలీతో సభాస్థలికి చేరుకోవాలని సన్నాహాలు చేసింది. అలంపురం నుంచి బాదంపూడి వరకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లతో కూడిన ఫ్లెక్సీలను నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జి ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణం వద్ద రెండు పార్టీల ఫ్లెక్సీలు అలరిస్తున్నాయి. చీకటి పడే అవకాశం ఉండడంతో సభా ప్రాంగణం వద్ద ఫ్లడ్‌లైట్‌లను ఏర్పాటు చేశారు.



మధ్యాహ్నం నుంచే తరలింపు

ఉమ్మడి సభ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. రెండు హెలికాప్టర్లలో చంద్రబాబు, పవన్ సభకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం నుంచే ప్రజలను తరలించేలా నాయకులు సన్నాహాలు చేశారు. తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ప్రైవేటు వాహనాలను సమకూరుస్తున్నారు. ఆర్టీసీ బస్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించింది. అయినా తాడేపల్లిగూడెం చుట్టుపక్కల నియోజకవర్గాల నుంచి ద్విచక్ర వాహనాలపై వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. ఆ దిశగా అన్ని నియోజకవర్గాల నుంచి ఇరు పార్టీ ముఖ్య నాయకులకు సమాచారం అందింది.

వైసీపీలో వణుకు : అచ్చెన్న

'ఉమ్మడి సభ నిర్వహిస్తామని ప్రకటించగానే వైసీపీలో వణుకు ప్రారంభమైంది. సభ ఎలా జరుగుతోందనన్న ఆందోళనతో ఉంది. ఎన్ని అవంతరాలు సృష్టించినా టీడీపీ, జనసేన కార్యకర్తలు వేలాదిగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. సభను విజయవంతం చేసేందుకు ఇరు పార్టీల నాయకులు అహర్నిశలు శ్రమించారు. వైసీపీ దుష్టపాలనను అంతం చేసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు హాజరై సభను వియవంతం చేయాలి' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

ఇది అందరి పండుగ : మనోహర్

'తెలుగుదేశం, జనసేన ఉమ్మడి సభ అందరి పండుగ. ఇది జెండా పండుగ. తెలుగుదేశం-జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. తొలిసారిగా ఉమ్మడి సభ నిర్వహిస్తున్నాం. తాడేపల్లిగూడెం వేదికగా నిర్వహించే సభను అన్ని వర్గాల ప్రజలు ఆదరించాలి. విజయంతం చేయాలి. పోలీసులు సహకరిస్తున్నారు. వలంటీర్లను ఏర్పాటు చేశాం' అని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం : తోట సీతారామలక్ష్మి



'వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు టీడీపీ, జనసేన కలిసి ముందుకు వెళ్తున్నాయి. నేటి సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రజలకు దిశా నిర్దేశం చేస్తారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పక్కా ప్రణాళికతో ముందుకు సాగేందుకు ఈ సభ వేదిక కానుంది' అని జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి చెప్పారు.

చంద్రబాబు, పవన్ పాల్గొనే తొలి ఉమ్మడి సభ కావడంతో ప్రజలు స్వచ్ఛందంగా రానున్నారు. ఆటోలు, కార్లు, బస్సులు ఏర్పాటు చేశారు. ప్రైవేటు స్కూల్ బస్సులను ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ఇవేమీ తెలుగుదేశం, జనసేన నాయకులు పట్టించుకోలేదు. సొంతంగా వాహనాలు సమకూర్చుకుంటున్నారు.

వేధింపుల ప్రభుత్వాన్ని తరిమేయండి



రాష్ట్రంలో వేధింపుల ప్రభుత్వం నడుస్తోందని హామీలు అమలు చేయని ప్రభుత్వంతో ప్రజలంతా విసుగు చెందారని ఆరిమిల్లి రాధాకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని జోన్-2 ఇన్‌చార్జి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం తణుకు తణుకు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు.

3న పల్స్ పోలియో వ్యాక్సిన్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : జిల్లాలో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కార్యక్రమం మార్చి 3న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 90శాతం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో చుక్కలమందు పంపిణీపై మంగళవారం ఏలూరులో వైద్యసిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో 0-5 ఏళ్ల వయస్సుగల 1,91,466మంది చిన్నారులున్నారని, వీరిలో గ్రామీణ ప్రాంత పిల్లలసంఖ్య 1,40,175మంది, పట్టణప్రాంత పిల్లలసంఖ్య 32,447మంది, గిరిజనప్రాంతాల పిల్లలసంఖ్య 18,844 మంది ఉన్నారన్నారు. వీరందరికీ వ్యాక్సిన్ వేసేందుకు మొత్తం 1,755 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాను 175 రూట్‌లుగా విభజించి 7,020 మంది వైద్యసిబ్బందిని నియమించామని, హైరిస్క్ ప్రాంతాలుగా 283 ఏరియాలను గుర్తించి నూరుశాతం వ్యాక్సినేషన్ జరిగేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. చిన్నపాటి రుగ్మతలు, జలుబు, విరేచనాలు ఉన్నప్పటికీ వ్యాక్సిన్ వేయవచ్చని స్పష్టం చేశారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో కూడా వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు వివరించారు. మార్చి 3న వ్యాక్సిన్ వేయించుకోని పిల్లలను గుర్తించేందుకు మరుసటి రోజు వైద్యసిబ్బంది, అంగన్వాడీ, ఆశా, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి వ్యాక్సిన్ క్యారియర్లతో ఇంటింటికీ తిరుగుతూ సర్వేచేసి వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. సర్వే సమయంలో ఇంటికి తాళం వేసివుంటే సందర్శించి నూరుశాతం వ్యాక్సినేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఎస్ఎంవో డాక్టర్ మౌనిక, ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి స్టెఫీ థామస్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, పీహెచ్‌సీలు, అర్బన్ పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

టెట్-2024 ప్రశాంతం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : ఏపీ ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్)లు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయంపూట జరిగిన పరీక్షకు జిల్లాలోని మూడు కేంద్రాల్లో 367 మంది అభ్యర్థులు దరఖాస్తుచేసుకోగా 291మంది, మధ్యాహ్నం పూట పరీక్షకు 367మందికి గాను 294మంది హాజరయ్యారని డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో పుర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ డైరెక్టర్ ఆర్.నరసింహారావు తనిఖీ చేశారు. మరో పరీక్షాకేంద్రాన్ని ఆగిరిపల్లి మండలంలో ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ మార్చి నాలుగో తేదీన ఒకపూట మాత్రమే పరీక్ష జరుగుతుందని డీఈవో కార్యాలయవర్గాలు తెలిపాయి.

కేంద్రంలో, రాష్ట్రంలో

మనదే అధికారం

- ప్రజలకు చేరువయ్యేలా సంకల్పం
- కేంద్ర పథకాలు ప్రజలకు చేరువ కావాలి
- బీజేపీ శ్రేణులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దిశా నిర్దేశం
- వారి చేతకానితనం వల్లే పోలవరం పూర్తికాలేదు


సమావేశంలో రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు పురందేశ్వరి, తపనా చౌదరి, అంబికా కృష్ణ, కామినేని, వర్మ తదితర నేతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఇతర పార్టీలతో పొత్తుకు సిద్ధపడుతుందా ? ఏదైనా కీలక ప్రకటన చేయబోతారా ? అని ఎదురుచూసిన కేడర్‌కు బీజేపీ అగ్రనేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాశనే మిగిల్చారు. గోదావరి క్లస్టర్ పరిధిలో బూత్ కమిటీ సభ్యులకు మంగళవారం ఏలూరులో రక్షణ మంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రత్యేకించి అధికార వైసీపీని దుయ్యబడుతూనే, కేంద్రంలో అత్యధిక స్థానాలతో ఎన్‌డీఏ ప్రభుత్వం రాబోతోందని కార్యకర్తల్లో జోష్ పెంచారు. అధికార వైసీపీని ఎడాపెడా కడిగేశారు. పేదలకు గుక్కెడు నీళ్లిచ్చే పథకమైన జలజీవన్ కింద రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించడానికి దిక్కు మొక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అవినీతిమయమే కాకుండా, ఒక విజన్ లేని ప్రభుత్వం ఉందని తూర్పారబట్టారు. గంటన్నరకు పైగా సాగిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక వైపు, బీజేపీయేతర పక్షాల అపజయాలను ఏకరవు పెడుతూనే ఇంకోవైపు బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాలను సవివరంగా వివరించారు. "రామ మందిర నిర్మాణం ఎప్పటిలోపు పూర్తి చేస్తారు ?


రక్షణ మంత్రికి వేంకటేశ్వరస్వామి ఫొటో అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి

సంవత్సరాలు, తేదీలు వున్నాయా ? లేదా ? అని కొందరు అనుమానం లేవనెత్తారు. కానీ అయోధ్యలో బాల రాముడిని ప్రతిష్ఠించాం. అనుకున్నది అనుకున్నట్టు క్రతువును పూర్తి చేశాం" అని రాజ్‌నాథ్ ప్రకటించినపుడు సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మిన్నంటింది. వేదికపై వున్నబీజేపీ నేతలు జైశ్రీరామ్ అంటూ నినదించారు. కార్యకర్తల్లో కనిపించిన జోష్‌ను చూసి బీజేపీ ప్రభుత్వం ఏదైతే చెబుతుందో అదే చేస్తుందన్నారు. రాబోయేది ఏపీలో వచ్చేది తమ ప్రభుత్వమేనని, ఇక్కడి నుంచి ఎంపీలు ఈసారి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని సంకేతాలిచ్చారు. ప్రతి కార్యకర్తకు ఒక లక్ష్యం వుండాలి. దీనికి సరిపడా శ్రమించాలి. బీజేపీ ప్రజల నుంచే నాయకులను తయారు చేస్తుంది. కాని, కొన్ని పార్టీలు మాత్రం కుటుంబాలను గురించి ఆలోచిస్తాయి. ప్రధాని మోడీ వల్ల నవభారత్ ఏర్పడింది" అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పోలవరానికి 50 వేల కోట్లు ఇవ్వడానికి కేంద్రం ముందుకువస్తే చేతకాని ప్రభుత్వాలు పూర్తి చేయలేకపోయాయని రాజ్‌నాథ్ మండిపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు బీజేపీ ప్రభుత్వం వస్తుందో అప్పుడే పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, సొంత ఇళ్ల వంటి పథకాలు అందుబాటులోకి తెచ్చింది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. స్వయం వికసిత భారత్ రావాలనే అందరి ఆకాంక్ష అని, ఇది సాధ్యం కావాలంటే బీజేపీ రాష్ట్ర, కేంద్రాల్లో అధికారంలో ఉండాలన్నారు.


సమావేశంలో గోదావరి క్లస్టర్ పరిధిలోని బూత్ కమిటీ సభ్యులు

డబులింజన్ ప్రభుత్వం రావాలి : తపన చౌదరి

రాష్ట్రంలో డబులింజన్ ప్రభుత్వం రావాల్సిందేనని పోలవరం నిర్మాణం సాధ్యం కావాలన్నా, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలన్నా ఇదొకటే ఏకైక మార్గమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ఒకప్పుడు రక్షణ విభాగం ఏకే 47 ఆయుధాలను కొనుగోలు చేసేదని, బీజేపీ పాలనలో ఏకే-203 ఆయుధాలను ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం తయారు చేస్తోందని, ఇది ఘనత కాదా అని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి అందరూ అందుకోవచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అందరూ అండగా ఉండాలన్నారు. అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. సీనియర్ నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ అన్నింటికీ సిద్దం అంటున్నారని బీజేపీ మాత్రం సేవకే సిద్ధమని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్‌జీ, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, మహిళా మోర్చ అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, సుభాష్ రాజు, ఈతకోట తాతాజీ, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు సీఎం జగన్ పెద అమిరం రాక

కాళ్ల, ఫిబ్రవరి 27 : సీఎం వైఎస్ జగన్ బుధవారం భీమవరం రానున్నారు. వైసీపీ నాయకుడు గుణ్ణం నరసింహనాగేంద్రరావు(నాగబాబు) కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించనున్నారు. సాయంత్రం తాడేపల్లి నుంచి బయలుదేరి పెదఅమిరంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రాధాకృష్ణ కన్వెన్షన్‌లో జరిగే ఈ వేడుకకు హాజరవుతారని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెలిప్యాడ్‌ను, కల్యాణ మండపాన్ని జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు.


పెదఅమిరంలో హెలీప్యాడ్ వద్ద కలెక్టర్,ఎస్పీలు

మిర్చి రైతు కుదేలు

- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- అదే దారిలో పడిపోయిన ధరలు
- క్వింటా రూ.12 వేల నుంచి రూ.15 వేల లోపే..
- పెట్టుబడులూ రావంటూ రైతుల ఆవేదన

వేలేరుపాడు, ఫిబ్రవరి 27 : ఈ ఏడాది మిర్చి రైతులకు కష్టాలు తప్పేలా లేవు. గతేడాది ధరలు ఆశాజనకంగా ఉండడంలో ఈ ఏడాది రైతులు మండల వ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రారంభం నుంచే పంటకు చీడపీడలు సోకడంతో కొంత దెబ్బతిన్నాయి. గత డిసెంబరు మొదటి వారంలో వచ్చిన తుఫాన్ కారణంగా వాగులు వంకలు పొంగిపొర్లడంతో వందలాది ఎకరాల మిర్చి పంట నీట మునిగి దెబ్బతింది. ఈ విపత్తు నుంచి రైతులు కోలుకుని మళ్లీ అష్టకష్టాలు పడి పంట సాగు చేయగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ ప్రాంతంలో ఎకరానికి 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే మిర్చి పంట వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా ప్రస్తుతం ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల లోపే వస్తోంది. అది కూడా నాణ్యమైన సరుకు దిగుబడి రావడం లేదు. ఇది చాలదన్నట్టు మిర్చి రైతుకు ధరాఘాతం తగులుతోంది. గతేడాది క్వింటా మిర్చికి రూ.25 వేల వరకు ధర రాగా ఈ ఏడాది రూ.12 వేల నుంచి రూ.15 వేల లోపే ధర పలుకుతోంది. ధరలు ఇలాగే ఉంటే పెట్టుబడుల్లో సగం కూడా రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర పెరిగితేనే ఒడ్డున పడతాం..

మిర్చి ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది శక్తికి మించి సాగుబడి చేశాను. తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతినడంతో మళ్లీ పంటను వేసినా దిగుబడులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ధరలు సగానికి సగం పడిపోయాయి. మిర్చి ధర పెరిగితేనే కానీ రైతు ఒడ్డున పడే అవకాశాలు లేవు.



\- మాచర్ల వెంకటేశ్వర్లు
రైతు, నడిమిగొమ్ము


కళ్లంలో ఆరబెట్టిన మిర్చి

పంట దిగుబడులు తగ్గాయి..

ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో పాటు మిర్చి పంటను చీడపీడలు పంటలను నష్టపరిచాయి. నల్లి ప్రభావం అధికంగా ఉండడంతో పంట దిగుబడులపై ఈ ప్రభావం తీవ్రంగా చూపుతోంది. దిగుబడులు తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.



\- వాసిరెడ్డి జగన్
రైతు, శివకాశీపురం



రామరాజుకు మద్దతు ఇవ్వను

- మాజీ ఎమ్మెల్యే శివరామరాజు

భీమవరం టౌన్, ఫిబ్రవరి 27 : ఉండి టీడీపీ అభ్యర్థి రామరాజుకు మద్దతు ఇచ్చేది లేదని మాజీ ఎమ్మెల్యే కలవపూడి శివరామరాజు ప్రకటించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నా హృదయం అగ్నిగోళంలా మండుతోందని పైకి చెప్పుకోలేకపోతున్నా. రామరాజు ప్రతినిత్యం అవమానపరిచేలా వ్యవహరిస్తున్నారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా ప్రజాక్షేత్రంలో ఉంటాను. టికెట్ ఇవ్వలేనప్పుడు కనీసం పార్టీ నన్ను సంప్రదించలేదు. ప్రజలు, పార్టీ కేడర్ నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది' అని అన్నారు. అంతకుముందు శివను మద్దతు కోరేందుకు ఎమ్మెల్యే రామరాజు ఆయన కార్యాలయానికి వచ్చారు. మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని ఆయన ముఖం మీదే చెప్పడంతో రామరాజు అక్కడ నుంచి వెళ్లిపోయారు.



పోలీసు నోటీసులపై ఉద్యోగుల జేఏసీ నిరసన

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై ఎక్కడా రాజీ ధోరణి లేదని, ప్రభుత్వం నియమించిన మంత్రుల ఉప సంఘం ఎదుట పెట్టిన సమస్యల పరిష్కారానికి జరిగిన చర్చల్లో రూపొందించిన మినిట్స్ మేరకు చర్యలు కనబడకపోతే రెండువారాల్లో సమావేశమై తదుపరి ఉద్యమకార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ ప్రకటించారు. ఆర్థిక బకాయిల చెల్లింపునకు జేఏసీ చేపట్టిన చలో విజయవాడ ఆందోళనకు ఉద్యోగులను అడ్డుకునేందుకు పోలీసులు నోటీసులు జారీచేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సాయంత్రం ఏలూరు ఎన్జీవో హోం వద్ద ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ వివిధ బకాయిల కోసం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గత్యంతరంలేని పరిస్థితుల్లో ఉద్యమానికి దిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసుచర్యలను చేపట్టడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులనే చెల్లించాలని ఉద్యమానికి దిగాల్సి రావడం ప్రభుత్వ దీనస్థితికి నిదర్శనమన్నారు. జేఏసీ సభ్యసంఘాల నాయకులు ఎన్.రామారావు, సత్యనారాయణ, సునీత, శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.



డీఈవోకు యూటీఎఫ్ నాయకుల వినతి

పది పరీక్షల నుంచి మినహాయించండి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : కొన్ని రోజుల్లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల విధుల నుంచి తీవ్రమైన అనారోగ్యం, మార్చి, ఏప్రిల్‌లో రిటైర్ కానున్న వారికి, అత్యవసర పరిస్థితులున్న టీచర్లను మినహాయించాలని అభ్యర్థిస్తూ మంగళవారం డీఈవో ఎస్.అబ్రహంకు యూటీఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ పత్రికలకు విడుదల చేశారు. గర్భిణులు, బాలింతలకు మినహాయింపు ఇవ్వాలని డీఈవోను కోరారు. హైస్కూళ్ళలో గతేడాది జనవరి నుంచి పనిచేస్తున్న యోగా ఇన్‌స్ట్రక్టర్లకు నెలవారీ వేతనం రూ.25 వేలు చొప్పున చెల్లించాలన్నారు. పాఠశాలలకు నిర్దేశించిన 220 పని దినాలు సరిపోయిన స్కూళ్ళకు మార్చి రెండో శనివారం పబ్లిక్ హాలిడేగా ఇవ్వాలని కోరామన్నారు. సంఘ నాయకులు సుభాషిణి, శ్యాంబాబు, రంగమోహన్, నరసింహారావు, శివశంకర్, మోహనరావు, ప్రసాద్, అప్పారావు, రాజారావు, కిరణ్‌కుమార్, లక్ష్మణరావు ఉన్నారు.

ప్రకృతి ప్రకోపం, చీడపీడల ఉధృతి మధ్య ఈ సీజన్‌లోనూ మామిడి రైతుకు ఎదురీత తప్పడం లేదు. దాదాపు ఐదేళ్లుగా మామిడి రైతును ప్రకృతి ఏదో రూపేణా దెబ్బతీస్తూనే ఉంది. 2019 నుంచి వరుసగా రెండేళ్లు కొవిడ్ ఎఫెక్ట్‌తో మార్కెట్లు సాగక దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా మామిడి రైతుకు నష్టాలనే మిగిల్చింది. అనంతరం చీడపీడల ఉధృతితో వరుసగా రెండేళ్లు నష్టపోగా, ప్రస్తుత సీజన్‌లోను చీడపీడలు ఉధృతి పెరగడంతో ఈ ఏడాదీ నష్టాలు తప్పేలా లేదు. నూజివీడు డివిజన్‌లో సుమారు 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. మూడేళ్లుగా మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతినడంతో ఇక్కడ నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి.

- నూజివీడు టౌన్



పిందె కట్టులేక తేలిపోతున్న మామిడి తోటలు

మామిడీలా!

పంటపై చీడపీడల ఉధృతి.. దిగుబడులపై ప్రభావం

- పురుగు మందులకు అదనపు పెట్టుబడులు
- కాపు రాని మామిడి తోటల తొలగింపు
- ధరల పైనే రైతుల ఆశలు

వేధిస్తున్న చీడపీడల ఉధృతి

మామిడిలో పూతదశ డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు కొనసాగుతోంది. అయితే డిసెంబరులో తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు పడగా, జనవరి ద్వితీయార్థం వరకు మామిడి పూతలు వెనుకంజ వేశాయి. అనంతరం మామిడిపూతలు వచ్చినా చీడపీడల ఉధృతి అధికంగా ఉంటోంది. ప్రధానంగా ఎర్రనల్లి, కాయతొలుచు పురుగు, కాటర్ పిల్లర్‌తో పాటు మంగు తెగులు ప్రభావం చూపుతుండడంతో రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు పిచికారీ చేయాల్సిన పరిస్థితి. అయినా పూత పిందెగా మారడం లేదని బొండుపూతతో ఖాళీ గెలలు మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.

ఐదేళ్ల క్రితం వరకు తోటల్లో సీజన్ మొత్తంగా మూడుసార్లు పురుగు మందులు పిచికారీ చేస్తే సరిపోయేదని, ప్రస్తుతం ఎనిమిది నుంచి డజనుసార్లు పిచికారీ చేస్తున్నా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. పురుగు మందుల నాణ్యత లోపంతో పిచికారీ చేసిన ఐదురోజుల్లోపే మరో రకమైన పురుగులు కాని లేదా ఎర్రనల్లికాని విస్తారంగా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడులు భారంగా మారుతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో ఎర్రనల్లి ప్రభావంతో పూతలు పూర్తిగా తుడిచి పెట్టుకు పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మూడేళ్లుగా ఉద్యాన వన పంటలపై ఎర్రనల్లి ప్రభావం ఉధృతంగా ఉండగా దాని పూర్తి నివారణ చర్యలపై నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం అధికారులు రైతులకు అవగాహన కల్పించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. టన్ను మామిడి కాయకోత మార్కెట్‌కు తరలించేందుకు దాదాపు రూ.నాలుగువేలు ఖర్చు అవుతుండగా గతేడాది టన్ను మామిడి ధర కేవలం రూ.2వేలు మాత్రమే పలికింది. ప్రస్తుత సీజన్‌లోనైనా మార్కెట్ కలిసివస్తే దిగుబడులు తగ్గినా మామిడి రైతు అప్పుల ఊబినుంచి బయటపడే అవకాశం ఉంది.

తోటలు నరికేస్తున్న రైతులు

చాట్రాయి : మండలంలో కాపురాని మామిడి తోటలను రైతులు నరికి మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు ఇక్కడ పండే బంగినపల్లి మామిడికి దేశ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండేది. కాలక్రమేణ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల మంగు తెగులు విజృంభించి కాయ నాణ్యత పడిపోయింది. చాలా తోటల్లో కాపు రాకపోవడం, వచ్చినా ధర లేక పోవడం, ఢిల్లీ సేట్‌ల మార్కెట్ మాయాజాలం, కోతకూలీ, రవాణా చార్జీలు విపరీతంగా పెరగడం, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాలతో కొన్నేళ్లుగా వరుస నష్టాలు రావడంతో రైతులు మామిడి సాగుపై విరక్తి చెందారు. చేసేది లేక తోటలు నరికి మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. పదిహేనేళ్ల క్రితం మండలంలో 20 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ప్రసుత్తం ఐదు వేల ఎకరాలకు తగ్గిపోయాయి.



చాట్రాయిలో మామిడి చెట్లు నరుకుతున్న కూలీలు

నష్టాలు తట్టుకోలేకే..



నష్టాలు తట్టుకోలేకే రైతులు మామిడి తోటలు నరికివేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. ఏటా సీజన్‌లో ఏదో కారణంతో ధరలు పడిపోవడం, కోత కూలీ రవాణా ఖర్చులు చేతికి రాక నష్టాలు వస్తున్నాయి.

- ఇజ్జిగాని వెంకటేశ్వరరావు
మామిడిరైతు, ఆరుగొలనుపేట



విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 27 : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఏపీ నిట్ డీన్ ప్లానింగ్ అండ్ డవలప్‌మెంట్ డాక్టర్ ఎస్.జయరాం అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణాన్ని మంగళవారం తణుకు మంటీస్సోరీ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ప్రాంగణంలోని ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్క్ షాపు, గ్రంధాలయం పరిశీలించారు. రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వీ.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యూహాలే లక్ష్యంగా దూసుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

పంచాయతీలపై పట్టింపేది ?

- పత్తాలేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- కేంద్రం విడుదల.. రాష్ట్ర ప్రభుత్వం స్వాహా
- నిధుల్లేక కునారిల్లుతున్న పంచాయతీలు
- నిధులు, విధులు లేని సర్పంచ్‌లు



(ఏలూరు రూరల్):

గ్రామసీమలు దేశానికి పట్టుకొమ్మలు, అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు నిస్తేజంగా మారాయి. నిధులు, విధులు లేక నిర్వీర్యమైపోతున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారింది. పంచాయతీల్లో నిధులు లేవు, పాలకులకు విధులు లేవు. ప్రభుత్వ తీరుతో నిస్తేజంగా మారాయి. ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేయకపోగా కేంద్రం విడుదల చేసే ఆర్థికసంఘం నిధులను కూడా సొంతానికే వాడేసుకుంటుంది. ఇక సచివాలయ వ్యవస్థ పంచాయతీ పాలకులను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నాయి. నిధులు, విధులు కోసం సర్పంచ్‌లు పోరుబాట సాగిస్తున్నా రాష్ట్రప్రభుత్వానికి పట్టడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలు పూర్తిగా దిగ జారిపోయాయి. ఊరికి మేలు చేయాలన్న ఆశతో ఎన్నికల్లో సర్పంచ్‌లుగా గెలిచిన వాళ్ళు నిధులు, విధుల్లేక ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. జగన్ పుణ్యమా అని సర్పంచ్ కన్నా వార్డు వాలంటీర్లకే జనాదరణ ఎక్కువగా ఉంది. 15వ ఆర్థికసంఘం నిధులను కేంద్రం సరైన సమయంలోనే రాష్ట్రానికి విడుదల చేసింది. పంచాయతీల ఖాతాల్లో జమ కావాల్సిన నిధులను కరెంటు బిల్లుల పేరుతో రాష్ట్రం పక్కదారి పట్టించింది. ఆ నిధులు తిరిగి విడుదల చేస్తామని చెప్పినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు. ఇంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మాత్రమే కొన్ని పంచాయతీలకు ఆదారంగా ఉంది. నామ మాత్రపు ఆదాయంతో మంచి చెడ్డల నిర్వహణ మోయలేని భారంగా ఉంది. కనీస అవసరాలు తీర్చలేక అప్పుల పాలవుతున్నామని సర్పంచ్‌లు వాపోతున్నారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయాలి. కాని ఇంత వరకు ఒక్క రూపాయి ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు విడుదల కాలేదు. సర్పంచ్‌లు నిరంతరం పోరాటం చేస్తున్నారు, సమస్యను కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఫలితం లేదు. నిధుల్లేక గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటింది. వైసీపీ పాలనలో పారిశుధ్య పనుల నిర్వహణ గతంలో గ్రీన్ అంబాసిడర్లు చేసేవారు. ఇప్పుడు క్లాప్ మిత్రలుగా మార్చారు. వీరికి స్వచ్ఛభారత్ కార్పొరేషన్ వేతనాలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఆ నిధులను దారి మళ్ళించింది. తాగునీటి పథకాల మరమ్మతులు, నిర్వహణ అయితే చాలా పంచాయతీల్లో లేదు. రక్షిత మంచి నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదు. గతంలో సర్పంచ్‌లు సొంత నిధులతో పనులు చేసి ప్రభు త్వం నుంచి వచ్చిన తరువాత తీసుకునే వారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో గతంలో పెట్టిన ఖర్చులకు దిక్కులేకుండా పోవడంతో పంచాయతీల్లో పనులను సర్పంచ్‌లు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు చెప్పవసరం లేదు

ప్రభుత్వం ఆదాయాన్ని తీసుకుని నిర్వహణ భారాన్ని పంచాయతీలపై నెట్టేస్తోంది. గ్రీన్ అంబాసిడర్లకు మూడేళ్ళుగా ప్రభుత్వం జీతాలు చెల్లించటం లేదు. దీంతో పంచాయతీల నిధుల నుంచే వారికి చెల్లిస్తున్నారు. దీంతో మోయలేని బరువుగా మారింది. సర్టిఫికెట్ల ద్వారా వచ్చిన నిధులు ప్రభుత్వమే తమ ఖాతాలో జమ చేసుకుంటోంది. కరెంటు బిల్లులు పెరిగిపోతున్నాయి.

నిధులు జమ చేయాలి

రాష్ట్రప్రభుత్వం కేంద్రం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీ అకౌంట్లో జమ చేయాలి. ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు ఇచ్చి ఆదుకోవాలి. లేనిపక్షంలో ఇవి కునారిల్లిపోయే పరిస్థితి ఉంది. సచివాలయాల మీద వచ్చే ఆదాయాలను పంచాయతీలకు పంచాలి. సచివాలయాలను సర్పంచ్‌ల ఆధీనంలోనే పనిచేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలి. ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైసీపీ పాలనలో గ్రామపాలన నిర్వీర్యమైంది.

- కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు

ప్రభుత్వ తీరుతో ఆత్మహత్యలు

పంచాయతీల సర్పంచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. ఆర్థికసంఘం ద్వారా కేంద్రం పంపిన రూ.629కోట్లు రాష్ట్రం దారి మళ్ళించి, పంచాయతీల అభివృద్ధిని అడ్డుకుంది. చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయకుండా సర్పంచ్‌ల ఆత్మహత్యలకు అప్పులకు కారణమయ్యారు. గ్రామ స్వరాజ్యం కోసం రాజ్యాంగం కల్పించిన 29 హక్కులను పరిరక్షించాలి. జనరల్ ఫండ్స్ అంతంత మాత్రమే గ్రామంలో సమస్యలు పరిష్కరించటానికి లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టాం. చిన్నచిన్న పనులకే వచ్చే అరకొర నిధులు సరిపోతున్నాయి.

- పాలడుగుల లక్ష్మణరావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

ఇంటింటికి కుళాయి ఇచ్చేదెప్పుడు ?

పనుల్లో కొనసాగుతున్న జాప్యం

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 27: ఏలూరు జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలోని 537 గ్రామాల్లోని 1567 హేబిటేషన్లలో ఈ జలజీవన్ మిషన్‌లో పనులు నిర్వహించాలని నిధులు మంజూరు చేశారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి అందరికీ స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ఈ జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో నిధులు మంజూరైనా పనులు నిర్వహించటానికి కొంత జాప్యం జరిగింది. ఇంటింటికీ కుళాయి ఏర్పాటు లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందో అనేది ప్రశ్నార్థకంగా మారింది. జలజీవన్ మిషన్ పథకంలో ఏలూరు జిల్లాలో రూ. 454 కోట్లతో 1770 పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు పరిశీలిస్తే 744 పనులు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల నివేదికలు చెబుతున్నాయి. 517 పనులు నిర్మాణ దశలో ఉన్నాయని చెబుతున్నారు. మిగిలిన పనులలో 509 పనులు కమ్యూనిటీ కాంట్రాక్ట్ విధానంలో గ్రామ జల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో జల సంఘాలను ఏర్పాటు చేశారు.



ప్రతి ఇంటికి కుళాయి :

జలజీవన్ మిషన్‌లో ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేయాలనేదే ప్రధాన లక్ష్యం. ఇళ్ళ వద్ద కుళాయి లేనిచోట్ల ఈ పథకంలో కుళాయిలు ఏర్పాటు చేస్తారు. అక్కడ ఉన్న మంచినీటి అవసరాలకు అనుగుణంగా వనరులను ఈ పథకంలో అభివృద్ధి చేస్తారు. పైప్ లైన్లు నిర్మిం చటం, నీటి నిల్వలను సక్రమంగా వినియోగించు కోవటం, అవసరమైన ప్రాంతాలలో మంచినీటి అవసరాలకు అనుగుణంగా పథకాలను ఏర్పాటు చేయటం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా సురక్షిత మైన మంచినీటిని అందరికీ అందించాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకంలో పనులను నిర్వహిస్తున్నారు. అయితే ఈ పథకం ప్రారంభంలో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేసి వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

వేసవి వచ్చినా పూర్తి కాని పనులు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా వేసవి వచ్చినా ఇంకా పనులు పూర్తి కాకపోవటంతో ఈ వేసవిలో మంచి నీటి ఎద్దడి తలెత్తుతుందనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తోంది. పథకం లక్ష్యం నెరవేరాలంటే జిల్లాలో మంచినీటి కుళాయిలేని అన్ని ఇళ్ళకు మంచినీటి కుళాయిని ఏర్పాటు చేయటంతోపాటు అక్కడి అవసరాలకు అనుగుణంగా మంచినీటిని సరఫరా చేయాలి. ఇప్పటికైనా వేగవంతంగా చేపట్టిన పనులు పూర్తి చేసి సురక్షితమైన మంచినీటిని అందిస్తే ఈ పథకం లక్ష్యం నెరవేరే అవకాశాలున్నాయి.

క్రైం కార్నర్

హత్యకేసులో నిందితుడి అరెస్టు

పోలీసులకు ఎస్పీ అభినందనలు...రివార్డులు



పట్టుబడ్డ నిందితుడితో పోలీసులు

పోలవరం, ఫిబ్రవరి 27 : పోలవరం మండలం కొత్తరామయ్యపేటలో ఆదివారం రాత్రి మేడూరి దుర్గ హత్య కేసులో హంతకుడ్ని పోలవరం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. మంగళవారం పోలవరం డీఎస్పీ ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి నిందితుడి అరెస్టు చూపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ కేసులో సీఐ జీ.మధుబాబు ప్రత్యేక బృందాలను, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ నిపుణులతో నేర స్థలాన్ని పరిశీలించి నిఘా ఏర్పాటు చేసి హత్యకు పాల్పడిన ముద్దాయిని అరెస్టు చేశారన్నారు. హతురాలి దూరపు బంధువైన మేడూరి ప్రసాద్‌కి మృతురాలికి మూడు నెలల క్రితం లైంగిక సంబంధం ఏర్పడిందని, ఇటీవల ఆమె మరొకరితో ఫోన్ మాట్లాడుతున్నట్లుగా అనుమానించి గొడవ పడ్డాడని దీంతో కూరగాయలు తరిగే చాకు జేబులో పెట్టుకుని మృతురాలి ఇంటికి సమీపంలో ఉన్న మామిడి తోట నుండి వెదురు కంచె దాటి వచ్చే సరికి మృతురాలు వేరే ఎవరితోనో ఫోన్ మాట్లాడుతుండగా ఆమెపై దాడి చేసి వెనుకకు నెట్టాడు. ఆమె బోర్లా పడేసరికి, అరవకుండా చీర కొంగుతో ఆమె మెడను ఒడిసిపట్టి చాకుతో మెడ కోసి ఆమె మాట్లాడుతున్న సెల్ ఫోన్ తీసుకుని అక్కడి నుంచి పారిపోయాడు. రక్తపు మరకలు అంటుకున్న బట్టలు తన గేదెల పాక వద్ద మార్చుకుని, చాకు రక్తపు బట్టలు మొక్కజొన్న చేలో దాచినట్లు తెలిపారు. ఆధారాలు స్వాధీనం చేసుకున్నామని, ముద్దాయిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అతి తక్కువ వ్యవధిలో కేసు మిస్టరీ చేధించడానికి సహకరించిన పోలీసులను జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అభినందించారని తెలిపారు. దర్యాప్తు బృందంలో సీఐ మధుబాబు, ఎస్ఐ పవన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఏలియా రాజు, సిబ్బంది జే.బాబీ, బీ.బాలాజీరావు, కే.కోటేశ్వరరావు, ఎం గంగరాజు, బీ.రమేశ్, కే.నాగరాజు, టీబీఆర్ ప్రసాద్, కే.మురళీకృష్ణ, జే.నాగలక్ష్మీ, పోలవరం బేస్ స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్ళు అశోక్, వీరబాబు, శివ, సతీష్ లను రివార్డులకు సిఫార్సు చేయడం జరిగిందన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి మహిళ మృతి



మేడిది వెంకట నరసమ్మ మృతదేహం

పాలకొల్లు రూరల్, ఫిబ్రవరి, 27 పాలకొల్లు-నరసాపురం రహదారిలో బట్టల షాపుల వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. నరసాపురం నుంచి పాలకొల్లు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రాల కింద పడి మోపెడ్ వెనక కూర్చున్న మేడిది వెంకట నరసమ్మ(55) అక్కడికక్కడే మృతి చెందింది. పాలకొల్లు పట్టణ ఏఎస్ఐ మార్లింగం తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మేడిది పెద్ద నరసింహ తన భార్యతో కలిసి పాలకొల్లులోని బంధువుల ఇంటికి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. భర్త నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మార్లింగం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రైలు ఎక్కుతూ జారిపడిన వ్యక్తి మృతి



గాంధీ మృతదేహం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 : రైలు ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలవడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు ఆర్ఆర్‌పేట డోకలవారి వీధికి చెందిన కొండపల్లి గాంధీ (36) ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి సికింద్రాబాద్ స్పెషల్ ట్రైన్‌ను ఎక్కుతుం డగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ సమాచారం రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గుంటూరు చేరుకుని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 27 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది. ఎస్ఐ జ్యోతిబాస్ తెలిపిన వివరాలివి.. కామవరపుకోట మండలం జలపవారిగూడెంకు చెందిన రాచప్రోలు శ్రీనివాస్(41) మూడేళ్ల క్రితం భార్య, పిల్లలతో జంగారెడ్డిగూడెం వచ్చి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన శ్రీనివాస్ కొంతకాలంగా భార్య సత్యవతితో తరచూ గొడవలు పడుతున్నాడన్నారు. మంగళవారం స్థానికంగా ఉన్న ఓ బార్ అండ్ రెస్టారెంట్ పక్కన ఖాళీ స్థలంలో శ్రీనివాస్ మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సీఐ రాజేష్, ఎస్ఐ జ్యోతి బాస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జ్యోతి బాస్ తెలిపారు.

మార్చి 1 నుంచి మేరీ మాత ఉత్సవాలు

కలిదిండి, ఫిబ్రవరి 27 : కలిదిండిలో మేరీ మాత ఉత్సవాలను మార్చి 1 నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తామని విచారణకర్త బంటుమిల్లి యోహాను తెలిపారు. 1న సమష్టి దివ్య పూజా బలి సమర్పణ, జపమాల, మేరీ మాత ఊరేగింపు నిర్వహిస్తామ న్నారు. 2న సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రార్థనలు, 3న జపమాల, తదితర పూజలు భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. విజయవాడలో గుణదల మేరీ మాత ఉత్సవాల అనంతరం కలిదిండిలో వైభవంగా మేరీ మాత ఉత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. భక్తులకు తాగునీటి కోసం ట్యాంకర్లు సరఫరా చేస్తున్నామని సర్పంచ్ మారుతీ ప్రసన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



ప్రమాదానికి గురైన బైక్ (ఇన్‌సెట్‌లో)విద్యార్థి యశ్వంత్

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 27: ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు అతివేగం కారణంగా అసువులు బాసి కన్నవారికి కన్నీరు మిగులుస్తున్నారు. ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎదురుగా మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో విజయవాడ నుంచి నూజివీడు వెళుతున్న మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను ఎన్ఆర్ఐ కళాశాలలో సీఎస్ఈ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆగిరిపల్లి మండలం నెక్కలం గ్రామ వాసి మచ్చా వెంకట్రావు కుమారుడు యశ్వంత్(19) తన బైక్‌తో ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని స్థానికులు స్పందించి 108కి సమాచారమిచ్చి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చనిపోయాడని ధ్రువీకరించారు. కళాశాల ఎదురుగా రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఇలా జరిగిందని స్థానికులు అంటున్నారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదని ఆత్మహత్య



రమ్యశ్రీ(ఫైల్)

పెదవేగి, ఫిబ్రవరి 27 : తనను ఎవరూ సరిగ్గా పట్టించుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ బాలిక బలవన్మరణానికి పాల్పడింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం వేగివాడకు చెందిన మాదు రమ్యశ్రీ అదే గ్రామంలో పదో తరగతి చదువుతోంది. బాలిక చిన్నతనంలో తల్లి చనిపోయింది. తండ్రి శ్రీనివాసరావు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిసైన తండ్రి తనను సరిగ్గా చూడడం లేదని మనస్తాపంతో సోమవారం ఉదయం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాలిక రమ్యశ్రీ (15) మంగళవారం సాయంత్రం మృతి చెందింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

హత్య కేసులో మనుమరాలికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 : మామను హతమార్చిన మనుమరాలి నేరం రుజువు కావడంతో ఆమెకు జీవిత ఖైదు విధిస్తూ ఏలూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి రామ్‌గోపాల్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కే.గోకవరం గ్రామానికి చెందిన తలారి రమేష్ అతని భార్య తలారి మరియ రాణి అమ్మమ్మ దొండపాటి లింగమ్మ(80) ఒకే ఇంట్లో నివాసం ఉండేవారు. 2019 జూన్ 27న తలారి మరియ రాణికి వరసకు మామ్మ అయిన దొండపాటి లింగమ్మను రోకలి బండతో కొట్టి హతమార్చింది. బాత్ రూమ్‌లో ప్రమాదవశాత్తు కాలు జారిపడి తలకు దెబ్బ తగిలి మరణించిందని నమ్మబలికింది. కులాచార ప్రకారం ఆమెను ఖననం చేశారు. ఆమె ప్రవర్తనపై రోజు రోజుకు అనుమానాలు రావడంతో సమాచారం తెలుసుకున్న అప్పటి చింతలపూడి సీఐ పి.రాజేష్ ఆమెను విచారించారు. దీంతో తానే హత్య చేశానని అంగీకరించింది. లింగపాలెం తహసీల్దార్ పర్యవేక్షణలో శవ పరీక్ష చేయించి, మరియరాణి (34)ను అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. మరియరాణి నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ న్యాయాధికారి జి.రామ్‌గోపాల్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.లక్ష్మనాయక్ వాదించగా ప్రాసిక్యూషన్‌కు చింతలపూడి సీఐ సుధాకర్, ధర్మాజీగూడెం ఎస్ఐ చిన్నారావు, కోర్టు కానిస్టేబుల్ జీ.రవికుమార్ సహకరించారు. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తరువాత ఇప్పటి వరకూ స్పీడ్ ట్రైల్ కేసులలో భాగంగా 11 కేసులలో జీవిత ఖైదు శిక్షలు పడ్డాయి.

వైద్యుడిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 : వైద్యం కోసం తల్లితో ఆసుపత్రికి వెళ్లిన ఓ యువతిని పెళ్ళి చేసుకుంటానని వివాహేతర సంబంధం కొనసాగించి, మోసం చేసిన వైద్యుడిపై ఏలూరు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. జిల్లాలోని ఒక ప్రాంతానికి చెందిన యువతి (28) తన తల్లి అనారోగ్యంతో ఉండడంతో వంగాయిగూడెంలోని గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అక్కడ డాక్టర్ కారంపూడి చంద్రశేఖర్ ఆమెకు వైద్యం చేశాడు. ఆ సయమంలో ఆ యువతితో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని పెళ్ళి చేసుకుంటానని నమ్మబలికి వివాహేతర సంబంధం కొనసాగించి ఆమెను గర్భవతిని చేశాడు. ఏలూరు ఆర్ఆర్ పేటలో ఉన్న జనని మెటర్నరి ఆసుపత్రికి తీసుకువెళ్ళి అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత పెళ్ళి చేసుకోమంటే నిరాకరించాడు. అతని తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి ఆ యువతి జరిగిన విషయం చెప్పగా వారు దుర్భాషలాడి బెదిరించారు. దీంతో బాధితురాలు ఏలూరు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో డాక్టర్ కారంపూడి చంద్రశేఖర్‌పై అత్యాచారం, చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చంద్రశేఖర్ నర్సరావుపేటకు చెందిన వాడిగా గుర్తించారు. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.

ఎలక్ట్రిక్ బైక్‌లో మంటలు



నరసాపురం, ఫిబ్రవరి 27 : పట్టణంలోని మెయిన్ రోడ్డులో మంగళవారం రాత్రి ఎలక్ట్రికల్ బైక్ దగ్ధమైంది. వస్త్ర దుకాణానికి చెందిన ఉద్యోగి లక్కు ఏండుకొండలు బైక్‌పై మార్కెట్‌లో వెళుతుం డగా ఒక్కసారిగా పొగలు వచ్చాయి. ప్రమాదాన్ని గుర్తించి వెంటనే బైక్‌ను వదిలేసి పరుగులు తీశాడు. క్షణాల్లో బైక్ మంటలకు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరకుని మంటలను ఆర్పారు. ప్యూరి కంపెనీకి చెందిన ఈ బైక్‌ను తన్మయి శ్రీనివాస్ రెండేళ్ల క్రితం లక్ష రూపాయలకు కొనుగోలు చేశాడు.

బలివే ఉత్సవాలకు ఏర్పాట్లు

ముసునూరు, ఫిబ్రవరి 27: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులపాటు జరిగే మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాటుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా స్వామి, అమ్మవారి ఆలయానికి, కల్యాణ మండపానికి రంగులు వేసి శోభయమానంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళవారం బారికేడ్ల నిర్మాణ ప్రక్రియను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ట్రాన్స్‌కో ఏఈ హేమసుందర్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ పనులు జరుగుతున్నాయి.

విజిలెన్స్ కేసులు ఎత్తివేయాలి

» పంచాయతీరాజ్ ఇంజనీర్ల ఆందోళన



నిరసన తెలియచేస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారుల సమస్యలు పరిష్కరించాలని, ఎస్ఎఫ్‌టి పనులపై విజిలెన్స్ విచారణ నిలుపుదల చేయాలని 300మంది సిబ్బంది పై పెట్టిన విజిలెన్స్ కేసులు ఎత్తివేయాలని ఇంజనీర్స్ ఆందోళన చేపట్టారు. ఏపీ పంచాయతీరాజ్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇంజనీర్స్ జేఏసీ చైర్మన్ ఉప్పలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల నిమిత్తం కేంద్రం ఇచ్చే 3శాతం అడ్మినిస్ట్రేటర్ ఛార్జీలు, రెండేళ్లుగా నిలుపుదల చేసిన వాహన బిల్లులు, నెలవారీ ఎఫ్‌టీఏ, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాల బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్ఎఫ్‌టి పనులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారని, ఆ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోకుండా ప్రిన్సిపల్ సెక్రటరి, మంత్రి హామీ ఇచ్చారని, ఆ హామీ నేటికి నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.మురళీకృష్ణ, ఎం.విజయ్‌కుమార్, రమణ మూర్తి, డీఈలు సురేష్, లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఎలా వెళ్లేది..?

» బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ వినతి

జంగారెడ్డిగూడెం ఫిబ్రవరి 27: పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు ఎలా వెళ్లాలని, సకాలంలో బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. పరీక్ష సమయంలో ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ జంగారెడ్డిగూడెం డిపో అధికారులకు మంగళవారం వినతిపత్రం అందించారు. విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడపాలన్నారు. ఎస్ఎఫ్ఐ జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షుడు బి.యశ్వంత్, జి.మణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తున్న వైసీపీ పాలకులు : బొరగం

బుట్టాయగూడెం: వైసీపీ నాయకుల అహంకార ధోరణి క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తుందని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతల ఒత్తిడికి క్రికెటర్ హనుమ విహారి బలి కావల్సి వచ్చిందన్నారు. వైసీపీ నేత కుమారుడిని మందలించిన పాపానికి విహారిని ఆంధ్రా క్రికెట్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించేలా కుట్రచేయడం సిగ్గుచేటన్నారు. విహారి తప్పులేదని టీంలోని సభ్యులు స్పష్టంగా చెప్పినా నేతల వేధింపులు ఆగలేదని, రాజారెడ్డి రాజ్యాంగాన్ని క్రికెట్‌లో అమలు చేస్తున్నారని విమర్శించారు.



వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విలేకరులతో బొరగం

ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు ప్రజలకు చేరాలి


ఎంపీ శ్రీధర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: ప్రజా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అన్ని కార్యక్రమాలు అధికారులు సమర్థవంతంగా అమలు చేసి ప్రయోజనాలను ప్రజలకు చేర్చాలని ఎంపీ కోటగిరి శ్రీధర్ కోరారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో అమలు జరుగుతున్న తీరు, ప్రగతిని సమీక్షించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య, సంక్షేమ అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టుకు సంబంధించి వాల్స్ మరమ్మతులు, అదనపు గేట్ల అమరిక, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు జల వనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలు నిలుపుదల విషయంపై రైల్వేబోర్డు చైర్మన్‌ను కోరినట్లు తెలిపారు. జిల్లాలో వృత్తినైపుణ్య కార్యక్రమాలు మరింత ముమ్మరం చేసి యువతకు అవకాశాలు కల్పించడంపై దృష్టిసారించాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను రానున్న రెండు నెలల్లో పూర్తిచేయాలని కోరారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ మాట్లాడుతూ ఉపాధి హామీకి సంబంధించి పాత పనులు పూర్తిచేసి పెండింగ్ బిల్లులు అప్‌లోడ్ చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈని ఆదేశించారు. అనంతరం ఎంపీ శ్రీధర్‌ను కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ సత్కరించారు. ఎంపీగా తన పదవీకాలం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. జడ్పీ సీఈవో సుబ్బారావు, దిశ కమిటీ సభ్యులు ఘంటా శ్రీలక్ష్మి, చింతలపూడి ఎంపీపీ బి.రాంబాబు, కైకలూరు సర్పంచ్ వసంతకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 27: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో మార్చి 1 వరకు నిర్వహించనున్న డిజిటల్ లిటరసీ అవగాహన కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నీలాద్రి, పలు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

భూహక్కు చట్టం రద్దు కోరుతూ పోస్టుకార్డుల ఉద్యమం


పోస్టుకార్డులతో న్యాయవాదులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27: భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏలూరులోని ఆలిండియా లాయర్స్ యూనియన్ న్యాయవాదులు (ఐలూ) పోస్టు కార్డులను రాసి ముఖ్యమంత్రికి పంపించారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనం వద్ద ఐలూ న్యాయవాదులు పోస్టు కార్డులను రాసి ముఖ్యమంత్రికి పంపించారు. ఏపీ భూహక్కుల యాజమాన్య చట్టం 27/2023 జీవో నెంబర్‌లు 512, 630 వెంటనే రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాసి పోస్టులో పంపించారు.

ఏఎన్ఎంలు ప్రజలకు సేవలందించాలి


రెడ్‌క్రాస్ విద్యార్థినులతో వైఎస్ విమలారెడ్డి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 : ఏఎన్ఎం విద్యార్థినులు చక్కటి విద్యను నేర్చుకుని ప్రజలకు సేవ చేయాలని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి వైఎస్ విమలారెడ్డి సూచించారు. ఏలూరు కెబి సింగ్ రోడ్డులో శుభోదయ నిలయాన్ని సందర్శించి అనంతరం రెడ్‌క్రాస్‌లోని ఏఎన్ఎం విద్యార్థినులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థనలు చేశారు. ఆమెను రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి, శుభోదయ నిలయం ఫాదర్ అల్ఫోన్సో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవేణి, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును పరిశీలించిన పోలవరం డీఎస్పీ


వేలేరు చెక్ పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ

కుక్కునూరు, ఫిబ్రవరి 27 : కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో డీఎస్పీ సురేషకుమార్ రెడ్డి మంగళవారం పర్యటించారు. పోలీసు స్టేషన్‌లను సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. స్టేషన్ లో క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంధ్ర తెలంగాణ సరిహద్దులో వేలేరు చెక్ పోస్ట్ పరిశీలించారు. కొద్దిరోజులుగా రాత్రి సమయంలో తెలంగాణ ప్రాంతానికి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్పీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. కుక్కునూరు సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డబ్ల్యూటీవో ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మికులు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 27: రైతులు, కార్మికులకు నష్టం కలిగించి, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)తో ఒప్పందాల నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఒప్పంద ప్రతులను దహనం చేసి క్విట్ డబ్ల్యూటీవో అంటూ నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ అబుదాబిలో జరుగుతున్న డబ్ల్యూటీవో సమావేశాలలో రైతాంగానికి, కార్మికులకు నష్టం కలిగించేవిధంగా మోదీ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకునేందుకు సిద్ధం కావడం దారుణమని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతులు మద్దతు ధరలు కల్పించాలని మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఒకవైపు దేశంలో రైతులు ఉద్యమాలు చేస్తుంటే అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందాలకు సిద్ధం కావడం దుర్మార్గమన్నారు. బొడ్డు రాంబాబు, అందుగుల ప్రభాకర్, కె.సుబ్బారావు, సీఐటీయూ నాయకులు బి.నాని, కె.స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం స్పందించకపోతే పనులు అడ్డుకుంటాం'

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 27: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల న్యాయం చేయకుంటే పనులు అడ్డుకుంటామని గ్రీన్ ఫీల్డ్ భూనిర్వాసిత రైతులు హెచ్చరించారు. పేరంపేటలో ఏపీ రైతు సంఘం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్‌హైవే భూ నిర్వాసిత రైతులకు ఆర్బిట్రేషన్ ద్వారా పరిహారం పెంచి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ అమలు చేయలేదన్నారు. పరిహారం పెంచుతూ ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ సేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పరిహారం పెంపుతో పాటు సర్వీస్ రోడ్లు, బోర్లు కోల్పోయిన వారికి బోర్లు, విద్యుత్ లైన్లు, ఆయిల్ పామ్, కొబ్బరి తదితర ఉద్యాన తోటలకు పరిహారం పెంపు హామీలు అమలు చేయలేదన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయకుండా భూ సేకరణ చట్ట వ్యతిరేకమన్నారు. హైవే భూ నిర్వాసిత రైతులు మరో దశ ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. గోలి నర్సిరెడ్డి, గూడపాటి శ్రీనివాసరావు, వందనపు సాయిబాబా, బొడ్డు రాంబాబు, బి.రామిరెడ్డి, బి.సత్తిరెడ్డి, గోలి రవీంద్ర రెడ్డి, మాండ్రు సూర్యచంద్రం, చలపతి కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


పెదపాడు మండలంలో మాట్లాడుతున్న చింతమనేని


ఏలూరు సమావేశంలో మాట్లాడుతున్న బడేటి చంటి


కామవరపుకోటలో టీడీపీ కార్యకర్తల సమావేశం


లక్కవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి

టీడీపీ, జనసేన కూటమితో

వైసీపీకి వణుకు

సభ విజయవంతం చేయాలని నేతల పిలుపు

పెదవేగి, ఫిబ్రవరి 27: టీడీపీ, జనసేన కూటమితో వైసీపీ నాయకుల వణుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నారు. దుగ్గిరాలలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ సమన్వయకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్తిపాడులో బుధవారం జరిగే టీడీపీ, జనసేన బహిరంగ సభ విజయవంతం చేయాలన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని ఆయన తెలిపారు. బహిరంగ సభ ఏర్పాట్లు చూస్తేనే వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెతున్నాయని, అవాంతరాలు కల్పించడానికి చూస్తున్నారన్నారు. పెదవేగి, దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల నుంచి భహిరంగ సభకు భారీగా జన సమీకరణ చేశామని, సభ విజయవంతానికి ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఉన్నారని ఆయన తెలిపారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చెన్నుపాటు గాంధీ, వసంత సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు, తాతా సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్ మద్యంతో కుటుంబాలు చిన్నాభిన్నం

పెదపాడు: మద్య నిషేధం హామీతో గద్దెనెక్కిన జగన్ మడమ తిప్పి నాసిరకం మద్యాన్ని ఏరులై పారిస్తున్నాడని చింతమనేని ప్రభాకర్ ఆరోపించారు. పెదపాడులో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి మంగళవారం ఆరు గ్యారంటీలపై మహిళలకు అవగాహన కల్పించారు. జగన్ అధిక ధర, నాసిరకం మద్యంతో పేదల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలవాలని కోరారు. ఘంటశాల వెంకటలక్ష్మి, బొప్పూడి కాశీబాబు, గుత్తా అనిల్, బొప్పన బాబ్జి, నర్రా సుబ్రహ్మణ్యం, గుండపనేని కళ్యాణ్, ఖండవల్లి జరహో, ఆగోళ్ళ కృష్ణారావు, వెంకట్రావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అరమరికలు లేకుండా కలసికట్టుగా పని చేద్దాం

ఏలూరు టూటౌన్: రాష్ట్రంలో అరాచక పాలన పోవాలంటే అమరికలు లేకుండా టీడీపీ, జనసేన కలసికట్టుగా పని చేయాలని టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బడేటి చంటి అన్నారు. జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పల నాయుడిని మంగళవారం ఆయన కలిశారు. జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా చంటికి టిక్కెట్టు రావడంతో అసంతృప్తికి గురైన జనసేన నేతలను కలిశారు. చంటి మాట్లాడుతూ మనం జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలన్నాలరు. దీంతో మెత్తబడ్డ అప్పలనాయుడు టీడీపీ, జనసేన విజయానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, ఎన్.నరేష్, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి : గన్ని

భీమడోలు: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం బైపాస్ సమీపంలో ఈ సభ జరుగుతుందని టీడీపీ శ్రేణులంతా ఉంగుటూరు చేరుకుని అక్కడ నుంచి భారీ ర్యాలీగా తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు.

- ఏలూరు టూటౌన్: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన సభను విజయ వంతం చేయాలని టీడీపీ నియెజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి పిలుపుని చ్చారు. బడేటి క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం ఉన్నారన్నారు. పిల్లి మాణిక్యాల రావు, నవీన్‌కుమార్, జంపా సూర్యనారాయణ, జాలా బాలాజీ, పాలి ప్రసాద్, జుంజు మోజేష్, శివప్రసాద్, అరుణ, దుర్గాభవాని, పాల్గొన్నారు.
- జంగారెడ్డిగూడెం: టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి పిలుపునిచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో గద్దె వెంకటసుబ్బారావు అధ్యక్షతన లక్కవరంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. చిలపరెడ్డి ఇంద్రాణి, కొఠారి ప్రసాద్, కొండ్రెడ్డి వీరాస్వామి, ఎలికే ప్రసాద్, గొల్లమందల శ్రీను, షేక్ నసీర్, శీలం రామచంద్రరావు, కుక్కల మాధవరావు, తడికమళ్ల గోపాల్, ముళ్ళపూడి శ్రీను, బలుసు కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.
- కామవరపుకోట: తాడేపల్లిగూడెం సభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పిలుపునిచ్చారు. పాతూరులో నాయకులు, కార్యకర్తలు, జనసేన కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యానులు, కార్లపై వెళ్లడానికి ప్రణాళిక రూపొందించారు. ఘంటా సుధీర్‌బాబు, పసుమర్తి పార్థసారధిబాబు, గూడపాటి కేశవరావు, గోరింక దాసు, కంఠమనేని పుష్పరాజ్యం, తూతా లక్ష్మణరావు, బచ్చు వీర వెంకట ముత్యాలరావు, జనసేన మండల కన్వీనర్ ఎస్.కె.వలీ పాల్గొన్నారు.
- చింతలపూడి తాడేపల్లిగూడెం సభను జయప్రదం చేయాలని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి టి.నాగ విజయకుమార్ కోరారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో 'మాటా' ఉచిత వైద్యసేవలు



మాట్లాడుతున్న డాక్టర్ విజయభాస్కర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: తెలుగు రాష్ట్రాల్లో పేదలకు ఉచిత వైద్య సేవలందించాలనే లక్ష్యంతో విస్తృతంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు 'మాటా' (మన అమెరికా తెలుగు అసోసియేషన్) జాతీయ అధ్యక్షుడు గనగోని శ్రీనివాస్, జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ బలగం విజయభాస్కర్ అన్నారు. ఏలూరులో మాటా ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్ళు, నరాలు, ఫిజియోథెరపీ ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రతినిది డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ ఫిజియోథెరపీ వైద్యసేవలు అవసరమైనవారికి రాగల వారం రోజులు ఉచిత సేవలు ఇస్తామన్నారు. జన్మభూమికి సహాయపడాలన్న లక్ష్యంతోనే మాటా కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ.భాస్కర్, సోషల్ జస్టిస్ చారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ శ్రీదేవి, ఎన్జీవోల సంఘం నాయకులు జె.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోవాలి : ఎస్పీ


ఎస్పీని కలసిన నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27: నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని అంతర్ జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్యకు సూచించారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మయ్య జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడాలన్నారు. రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించిన ఓటు హక్కును వారు స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందన్నారు. అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని సూచించారు.

ఓటు సద్వినియోగం చేసుకోవాలి

పెదవేగి, ఫిబ్రవరి 27: రానున్న ఎన్నికల్లో ప్రజలంతా ఓటు సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నికలకు అందరూ సహకరించాలని నూజివీడు డీఎస్పీ ఎం.లక్ష్మయ్య అన్నారు. ఆయన మంగళవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. వివాదాలు జరిగితే తక్షణం సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, నేరుగా తనను సంప్రదించవచ్చని డీఎస్పీ సూచించారు. ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్‌నుంచి వివరాలు తెలుసుకున్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

జంగారెడ్డిగూడెం ఫిబ్రవరి 27: జాతీయ లోక్ అదాలత్ మార్చి 16న జరగనున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయాధికారి సీహెచ్.కిషోర్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులు ప్రకారం మార్చి 9న జరగాల్సిన లోక్ అదాలత్ 16వ తేదీకి మార్పు చేయడం జరిగిందన్నారు. న్యాయవాదులు, కక్షిదారులు కేసులను మార్చి 16న కేసులు రాజీ చేసుకోడానికి సంసిద్ధం కావాలని ఆయన తెలిపారు

టెన్నికాయిట్‌లో చింతలపూడి విద్యార్థికి రజత పతకం


పతకం సాధించిన పవన్‌కుమార్

చింతలపూడి, ఫిబ్రవరి 27: జాతీయ స్థాయి టెన్నికాయిట్ పోటీలలో చింతలపూడి కళాశాల విద్యార్థి ఎస్.పవన్‌కుమార్ రజత పతకం సాధించాడని ప్రిన్సిపాల్ బి.ముత్యవతి, డైరెక్టర్ బి.వసంతకుమార్ తెలిపారు. రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర టీమ్ తరపున పాల్గొన్నాడని, పీడీ ప్రకాష్‌రెడ్డి, పీఈటీ కొండా వెంకటేశ్వరరావు విద్యార్థికి శిక్షణ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్‌లు కూడా తనకు ఎంతో ప్రోత్సాహం ఇచ్చారని, తాను ఈ స్థాయికి రావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపాడు.

మండలానికి రూ.50లక్షలు నాడు-నేడు నిధులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : జిల్లాలోని ప్రతీ మండలానికి రూ.50 లక్షలు చొప్పున నాడు-నేడు రివాల్వింగ్ ఫండ్ నిధులు విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ బి.సోమశేఖర్ తెలిపారు. కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల పునర్నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలకు, కళాశాలల ఖాతాలకు జమచేసిన స్కూల్ మెయింటెనెన్స్ గ్రాంట్ నిదులతో మరమ్మతు పనులను వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. నాడు-నేడు నిదులతో అదనపు తరగతి గదుల నిర్మాణం, ఆర్వో వాటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డిగ్రీ కళాశాలలో ల్యాబ్ టు స్కూల్



ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రయోగం

ఉంగుటూరు, ఫిబ్రవరి 27: విద్యార్థులకు సైన్స్ ప్రదర్శనలతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ల్యాబ్ టు స్కూల్ సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం లీలా కుమారి అన్నారు. నారాయణపురం డిగ్రీ కళాశాలలో భౌతిక, రసాయన, జంతు, గణిత శాస్త్రంలో పలు ప్రయోగాలను పాఠశాల విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ టీకే.విశ్వేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అధ్యాపకులు కొండా రవి, పుట్లా బాబూరావు, బి.వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు.

రాచూరు హైస్కూలులో సైన్స్ డే ప్రదర్శన

ఉంగుటూరు, ఫిబ్రవరి 27: రాచూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని మంగళవారం కళా ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. హెచ్ఎం విజయకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వెలిచెర్ల శ్రీను, దామోదరం ప్రదర్శన నిర్వహించారు.

జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 27: జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ఎం.రమేష్‌బాబు నియమితులయ్యారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై జంగారెడ్డిగూడెంకు వచ్చారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన భవానీ ప్రసాద్‌ను ఏపీ సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

ఏజెన్సీలో గిరిజనేతరుల నియామకాలపై ఫిర్యాదు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: వైద్య ఉద్యోగుల సమస్యలపై జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్‌కు దాదాపు 60మంది హాజరయ్యారు. ఏజెన్సీ మండలాల్లో జీవో 58ఉత్తర్వులకు విరుద్ధంగా గిరిజనేతర ఉద్యోగులను నియమించడంపై ఆదివాసీ ఉద్యోగుల సంఘ నాయకులు జిల్లా వైద్యాధికారి శర్మిష్టకు అర్జీ అందజేశారు. క్షేత్ర స్థాయి నుంచి నివేదిక తీసుకుని ఉల్లంఘనలు నిర్ధారణ అయితే తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఒకే కేడర్ స్టాఫ్ నర్సులకు వివిధ స్కీంలలో వేతన వ్యత్యాసంపై పలువురు నర్సులు ఫిర్యాదు చేశారు. జిల్లాస్థాయిలో పరిష్కారం చేయలేమని, ప్రభుత్వానికి పంపిస్తానని శర్మిష్ట వివరించారు. జిల్లా సర్వజన ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని డీఅడిక్షన్ సెంటర్ ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలను సమర్పించగా, ఇది ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలోకి వస్తుందని, అక్కడి అదికారులకు నివేదించాలని సూచించారు. కొవిడ్ సమయంలో ఏర్పాటైన వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లో మైక్రో బయాలసిస్టులకు 6నెలల కాలానికే వేతనాలు ఇచ్చారని, మరో రెండు నెలల వేతనాలు రావాల్సి ఉందని అర్జీని అందజేశారు. ఆరు నెలల కాలానికే ప్రభుత్వం అప్రూవల్ ఇచ్చిందని జిల్లా వైద్యాధికారి వివరించారు.

వెబ్‌సైట్‌లో పీఏటీ హాల్ టిక్కెట్లు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 : జిల్లాలో ఎంపికచేసిన పరీక్షాకేంద్రాల్లో మార్చి 3 నుంచి నిర్వహించనున్న ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్టు (పీఏటీ) అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు జారీ అయ్యాయి. bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి పొందేందుకు మంగళవారం నుంచి డౌన్ లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు డీఈవో ఎస్.అబ్రహం మంగళవారం తెలిపారు.

టీచర్ల సొసైటీ సొమ్ము మళ్లింపు ఆరోపణలపై విచారణ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27: ఏలూరు నగరపాలక సంస్థకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సహకార సొసైటీలో అవినీతి, అక్రమాలపై కొందరు టీచర్లు, యూటీఎఫ్ చేసిన ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణాధికారిని నియమిస్తూ డివిజనల్ సహకార అధికారి ఉత్తర్వులు జారీ చేశారని యూటీఎఫ్ నగరశాఖ కార్యదర్శి రాజారావు మంగళవారం తెలిపారు. సొసైటీ సొమ్ము సుమారు రూ.50 లక్షల వరకు ప్రైవేటువ్యక్తి ఖాతాకు అక్రమంగా మళ్లించినట్టు ఆరోపించారు. ఎఫ్‌డీలు సకాలంలో చెల్లించకపోవడం, నిరర్ధక బకాయిలను వసూలు చేయకపోవడం, సాలుసరి ఆడిట్ నిర్వహించక పోవడం తదితర ఆరోపణలున్నాయన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** మాదేపల్లిలో నాలుగో విడత ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. రూరల్ మండలంలోని 631 సంఘాల్లోని 5993 మంది మహిళలకు రూ.4.94 కోట్ల ఆసరా చెక్కులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అందజేశారు.
- **ఏలూరు టూటౌన్ :** సేవా భావం కలిగి పేద ప్రజలకు అండగా నిలబడాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి జయరావు పొలిమేర అన్నారు. మాజీ మంత్రి కేఎస్ జవహర్, చింతలపూడి ఇన్‌చార్జ్ రోషన్‌కుమార్‌లు బిషప్ జయరావును కలిశారు. విశాఖ పీఠాధిపతిగా అదనపు బాధ్యతలు స్వీకరిరచనున్న సందర్భంగా జయరావును వారు సన్మానించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** రామకోటి ప్రాంగణంలో పట్టాభిరామ భజన మండలి సభ్యులు విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సంక్షేమ రామాయణం, మినీ సుందరకాండ నిర్వహించారు. త్రిభాషా మహా సహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ ప్రవచనం ఇచ్చారు.
- **కామవరపుకోట :** కె.ఎస్.రామవరం గ్రామ సచివాలయ ఆవరణలో పీహెచ్‌సీ వైద్యులు ఆరోగ్య సురక్ష-2 ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 287 మందికి ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జడ్పీటీసి కడిమి రమేష్, తదితరులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** నాయుడుగూడెంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్ చక్రధర్, సిబ్బంది పలువురికి వైద్యసేవలు అందజేసి మందులు అందజేశారు. ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.
- పెదపాడు మండలం అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో 200 మందికి అన్న సమారాధన నిర్వహించినట్లు ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. తొలుత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.
- పెదపాడు మండలం వట్లూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రతిభ కనబర్చిన వలంటీర్లను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ సన్మానించారు. ఎంపీపీ బత్తుల రత్నకుమారి పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం మాజీ ఉప సర్పంచ్ అడపా శ్రీనివాసరావు దంపతులు పెళ్లి రోజును పురస్కరించుకుని ఆనంద నిలయం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేశారు.
- ఉంగుటూరు, నిడమర్రు మండలాల గృహ లబ్ధిదారులకు సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఈ సురేష్ తెలిపారు.
- ఉంగుటూరు మండలం నుంచి ఏలూరులో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభకు నియోజకవర్గ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి, పెనుమత్స రామచంద్ర రాజు,తదితరుల నాయకత్వంలో కేడర్ తరలి వెళ్లారు.




ఏలూరులో సౌకర్యాలు పరిశీలిస్తున్న ఎస్పీ, బుట్టాయగూడెంలో తహసీల్దార్లతో పీవో సమావేశం, లింగపాలెం మండలంలో ఆర్డీవో సూచనలు

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలుచోట్ల ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ ఫోర్స్ విభాగాలకు చెందిన సిబ్బంది సుమారు రెండు నెలలపాటు ఏలూరులో ఉండనున్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు నివాస భవనాలను టూటౌన్ ప్రాంత పరిధిలో ఎస్పీ మేరీ ప్రశాంతి మంగళవారం పరిశీలించారు. భవనాల్లో మౌలిక సదుపాయాలు, ఎంత మంది సిబ్బందికి వసతి సాధ్యమనే అంశాలను స్వయంగా పరిశీలించారు. సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపై అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఎస్‌బి సీఐ ఆది ప్రసాద్, టూటౌన్ సీఐ ప్రభాకర్ పలువురు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి : ఐటీడీఏ పీవో

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలోని ఎన్నికల విధులకు నియమితులైన అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అన్నారు. ఐటీడీఏ మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గంలోని తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అప్పగించిన ఎన్నికల పనులను నూరుశాతం విజయవంతం చేయాలన్నారు. పొరపాట్లకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏడు మండలాల తహసీల్దార్లు, ఐటీడీఏ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ

లింగపాలెం: బోగోలులోని పోలింగ్‌కేంద్రాలను రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో కె.అద్దయ్య తనిఖీ చేశారు. తహసీల్దార్ ప్రసాద్‌తో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో పోలింగ్ కేంద్రాలను మార్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాటిని దగ్గర్లో ఉన్న సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లోకి మార్చారు. బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మామిడీలా!

అప్పుల ఊబిలో రైతు

ప్రతి సంవత్సరం ఆశగా ఎదురుచూపు

ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు



పిందె కట్టలేక తేలిపోతున్న మామిడి తోటలు

(నూజివీడు టౌన్): ప్రకృతి ప్రకోపం చీడపీడల ఉధృతి మధ్య ఈ సీజన్‌లోనూ మామిడి తోటలు వెలవెలబోతున్నాయి. దాదాపు ఐదేళ్లుగా మామిడి రైతును ప్రకృతి ఏదోరూపేణా ఎదురుదెబ్బ తీస్తూనే ఉంది. నూజివీడు డివిజన్‌లో సుమారు 20 వేల హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. గత మూడేళ్లుగా మామిడి నాణ్యత పూర్తిగా దెబ్బతినడంతో ఎగుమతి అవకాశాలు మృగ్యమయ్యాయనే చెప్పవచ్చు.

వేధిస్తున్న చీడపీడల ఉధృతి...

మామిడిలో పూతదశ డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు కొనసాగుతుంది. అయితే డిసెంబరులో తుఫాన్ ప్రభావంతో భారీవర్షాలు పడగా, జనవరి రెండవ వారం వరకు మామిడిపూతలు వెనుకంజ వేశాయి. ప్రధానంగా ఎర్ర నల్లి, కాయ తొలుచు పురుగు, కాటర్ పిల్లర్‌తో పాటు మంగు తెగులు మామిడిపై ప్రధానంగా ప్రభావం చూపుతున్నాయి. దీంతో మామిడితోటల్లో పూత, పిందెగా మారడం లేదని, బొండుపూతతో ఖాళీగెలలు మాత్రం మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పురుగుమందుల నాణ్యతపైన అనుమానాలు ఎన్నో..

మామిడి సీజన్‌లో పూత, కాతను నిలబెట్టుకునేందుకు మామిడి రైతులు విస్తారంగా పురుగుమందుల పిచికారీ చేపడుతున్నారు. గతంలో మామిడి తోటల్లో మొత్తం మీద మూడుసార్లు పురుగు మందులు పిచికారి చేస్తే సరిపోయేది. కాని ప్రస్తుతం ఒక్కో రైతు 8నుంచి 12 సార్లకు మించి పురుగుమందు పిచికారి చేయాల్సి వస్తోందని, రైతులు వాపోతున్నారు.

ఎర్రనల్లి పై విస్తారంగా పరిశోధనలు చేయాలి..

నూజివీడులో భవిష్యత్తులో మామిడి మనుగడ సాగించాలంటే చీడపీడలు, తెగుళ్ల పై విస్తృత పరిశోధనలు చేయడంతో పాటు వాటిని క్షేత్రస్థాయికి చేరేలా ప్రభుత్వాధికారులు చర్యలు చేపట్టాలి. నూజివీడు కేంద్రంగా మామిడి పరిశోధనా కేంద్రం ఉన్నా పరిశోధనల్లో ఫలితాలు క్షేత్రస్థాయికి చేరటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సీజన్ కలిసొచ్చేనా..

మామిడి రైతుకు ప్రస్తుత సీజన్ అయినా కలిసి వస్తుందా అనే అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. గత ఏడాది రాతిమంగు, మసి తెగులుతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నిరుడు టన్ను మామిడి కేవలం రూ.2 వేలు మాత్రమే పలికింది. దీంతో తోటలను కోసేందుకు ఎదురు ఖర్చుపెట్టాల్సి వచ్చింది.

తోటలు నరికేస్తున్న రైతులు...

చాట్రాయి: చాట్రాయి మండలంలో కాపురాని మామిడి తోటలను రైతులు నరికి మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. గతంలో ఢిల్లీ శేర్‌లు సీజన్‌కు ముందు వచ్చి పెద్ద రైతులు, వ్యాపారులతో ఒప్పందాలు చేసుకొని మామిడి కమీషన్ మార్కెట్లు ఏర్పాటు చేసి, విజయవాడ, ఢిల్లీ, ముంబాయ్, ఇండోర్, లుధియానా, అహ్మదాబాద్, అమృతసర్, చెన్నై పట్టణాలకు మామిడి ఎగుమతులు చేసేవారు. ప్రస్తుతం వరుస నష్టాలతో రైతులు మామిడి సాగుపై విరక్తి చెందారు. చేసేది లేక మామిడి తోటలు నరికి మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. 15 ఏళ్ళ క్రితం మండలంలో 20 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, ప్రస్తుతం 5 వేల ఎకరాలకు తగ్గిపోయాయి.

నష్టాలు తట్టుకోలేకే తోటల నరికివేత..



నష్టాలు తట్టుకోలేకే రైతులు మామిడి తోటలు నరికివేస్తున్నారు. మామిడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి. ఏటా సీజన్‌లో ఏదో కారణంతో ధరలు పడిపోవటం వలన, కోతకూలీ రవాణా ఖర్చులు చేతికి రాక నష్టాలు వస్తున్నాయి. సర్కార్ చేయూత అందిస్తేనే మామిడి సాగు మిగులుతుంది.

-ఇజ్జిగాని వెంకటేశ్వరరావు,
మామిడిరైతు, ఆరుగొలనుపేట, చాట్రాయి మండలం.



చాట్రాయిలో మామిడి చెట్లు నరుకుతున్న కూలీలు



చాట్రాయిలో దళితుల భూములు పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీ శంకరి

కోడ్ వచ్చే వరకు జాబితా సవరణ : ఆర్డీవో

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 27: ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఓటర్ల చేర్పులు, సవరణలను చేసేందుకు అవకాశం ఉందని, నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి తెలిపారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పక్షాలతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఫారం-6, 7, 8లను సమర్పించవచ్చన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ వద్ద గల ఎన్నికల బూత్‌ను కొత్తపేట పాఠశాలకు మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆమె ఆదేశించారు. కాగా పోలింగ్ స్టేషన్‌ల తనిఖీలను అధికారులు కింది స్థాయి సిబ్బందిపై వదిలేస్తున్నారని జనసేన నాయకులు ముత్యాల కామేష్, ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు బోను అప్పారావు, పగడాల సత్యనారాయణ, యనమదల సత్యనారాయణ, ఏనుగుల చక్రి, బొందిలి రామ్‌సింగ్, జి.రాజు పాల్గొన్నారు.

చాట్రాయిలో దళితుల భూముల పరిశీలన..

చాట్రాయి: చాట్రాయిలో దళితుల భూములను మంగళవారం సాయంత్రం నూజివీడు ఆర్డీవో భవాని శంకరి పరిశీలించారు. తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న 8.32 ఎకరాల భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని 34 మంది వారసులు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఆదర్శ్ రాజేంద్రన్ కూడా ఈ భూములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సాగుదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని, రికార్డులు పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ, మండల సర్వేయర్ ప్రేమ్‌కుమార్, వీఆర్వో మురుగన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలసిన నూజివీడు నూతన డీఎస్పీ



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 27 : నూజివీడు నూతన డీఎస్పీగా బాధ్యత లు చేపట్టిన గేలి లక్ష్మయ్య ఏలూరు లోని జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి ఎస్పీ మేరీ ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్కను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పటిష్ఠమైన చర్యలు తీసుకుని శాంతి భద్రతలను కాపాడాలని డీఎస్పీకి సూచించారు. ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందన్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి



పార్థసారథికి గజమాలతో తెలుగు తమ్ముళ్ల స్వాగతం

ప్రజలకు పెద పాలేరుగా ఉంటా!

» దొరగారూ.. నూజివీడులో అభివృద్ధిలో మీ పాత్ర ఏంటి?

» టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి

నూజివీడు, ఫిబ్రవరి 27: దొరను కాను, పెదపాలేరుగా ఉంటా.. పేద, బడుగు, బలహీనవర్గాల కష్టసుఖాలు తెలిసిన వాడిని.. ఒక్కసారి అవకాశమివ్వండి.. అంటూ నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రజలను అభ్యర్థించారు. నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో ర్యాలీగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నవరత్నాల ద్వారా రూ.2 లక్షల 40 వేల కోట్లు ప్రజలకు అందించానని చెప్తున్న జగన్‌రెడ్డి, మద్యపాన నిషేధం అమలు చేయకుండా లక్షా 25 వేల కోట్లు పేదల రక్తం పీల్చి వసూలు చేశాడన్నారు. దొరగారూ నూజివీడు అభివృద్ధిలో మీ పాత్ర ఏమిటి? ఎక్కడో పోలవరం గురించి అడగటం లేదు. ఇక్కడ చింతలపూడి పూర్తిచేసి ఉంటే ఈ ఐదేళ్లలో రైతులకు రూ.3,600 కోట్లు పంటల ద్వారా వచ్చి ఉండేది. చింతలపూడిని నిలిపివేశారని తెలిసినా మీరు అసెంబ్లీలో మాట్లాడలేదు. గత ప్రభుత్వం 80 శాతం పూర్తిచేసిన టిడ్కో ఇళ్ళను సైతం నిలిపివేసి పేదల నుంచి రుణాల రూపంలో వసూలు చేస్తే ఈఎంఐలు, అద్దెలు కట్టలేక పేదలు పడుతున్న బాధలు మీకు కనిపించవు. సర్పంచ్‌లు నేడు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయారు. కేంద్రం ఇచ్చిన నిధులను కూడా రాష్ట్రం తరలించుకుపోతే మాట్లాడే పరిస్థితి రాష్ట్రంలో లేదు. రాష్ట్రంలో సలహాదారులు ఉన్నా నేను అడిగినప్పుడే సలహా ఇవ్వండి అనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉంది. జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పంచాయతీలకు డబ్బులు ఇస్తే కేంద్ర ప్రభుత్వం తీసుకుంటే మీరు ఒప్పుకుంటారా అంటూ పార్థసారథి ప్రశ్నించారు. పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నా ఆలోచించరు. సంక్షేమం, అభివృద్ధి సమానంగా ముందుకు సాగాలంటే చంద్రబాబు సీఎం అవ్వడం ఒక్కటే పరిష్కారం అన్నారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. షెడ్యూల్ ప్రకారం తెలుగుదేశం పార్టీ ర్యాలీ సాయంత్రం 5 గంటలకు నూజివీడు చేరుకుంటుందని చెప్పగా, రాత్రి 9 గంటలకు పార్థసారథి ర్యాలీగా నూజివీడు చేరుకున్నారు.

కొలుసుకు ఘన స్వాగతం

నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కొలుసు పార్థసారథికి నూజివీడు నియోజకవర్గంలో అపూర్వ స్వాగతం లభించింది. నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పార్థసారథిని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన అనంతరం అధికారికంగా పార్థసారథి టీడీపీలో చేరి, తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు టీడీపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. నూజివీడు నియోజకవర్గం ప్రారంభమయ్యే సీతారాంపురం సెంటర్ వద్ద సీతారాంపురం సర్పంచ్ లింగమనేని సత్యవాణి పార్థసారధికి స్వాగతం పలుకగా, టీడీపీ శ్రేణులు భారీ బైక్, కారు ర్యాలీతో ఆయనకు స్వాగతం పలికారు. ప్రతి గ్రామ కూడళ్లలో భారీ గజమాలలతో ఆయనకు తెలుగు తమ్ముళ్ళు స్వాగతం పలుకగా, సాయంత్రం 5 గంటలకు నూజివీడు పట్టణంలోకి ప్రవేశించాల్సిన ర్యాలీ దాదాపు రెండు గంటలు ఆలస్యంగా చేరుకుంది.

నూజివీడు తరలిన తెలుగు తమ్ముళ్ళు

ముసునూరు: నూజివీడు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికై నూజివీడు విచ్చేస్తున్న కొలుసు పార్థసారధికి స్వాగతం పలికి, సభలో పాల్గొనేందుకు ముసునూరు మండలం నుంచి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్ళారు. సూరేపల్లి, గుడిపాడు, చెక్కపల్లి, ముసునూరు, కాట్రేనిపాడు, వలసపల్లి తదితర గ్రామాల నుంచి గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ళు బైక్‌లు, కార్లతో ర్యాలీగా వెళ్ళారు.



తూనికలు, కొలతలపై అవగాహన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 27: నూజివీడు పట్టణంలోని రైతుబజారు వద్ద లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లీగల్ మెట్రాలజీ విభాగం ఏలూరు జిల్లా డిప్యూటీ కంట్రోలర్ బీవీ హరిప్రసాద్ రైతు బజారుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం తూనికల్లో జరిగే మోసాలను, ఎలక్ట్రానిక్ కాటాల వినియోగంపై అవగాహన కల్పించారు. తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ బి.ప్రశాంత్ పాల్గొన్నారు.

సురక్ష వైద్య శిబిరాలు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 27: సుంకొల్లులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సునంద అధ్యక్షతన జరిగిన శిబిరంలో 425 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులను అందించారు. ముగ్గురికి తదుపరి వైద్యసేవలు అవసరమని గుర్తించినట్టు తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్లు కౌముది, సోని తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: తుమ్మగూడెం శిబిరంలో 356 మందికి ఏలూరు జీజీహెచ్ వైద్య నిపుణులు షేక్ అజాద్, పి రఘువీర్, పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులరెడ్డి, దుర్గాప్రసాద్ రోగులకు పరీక్షల నిర్వహించి ఉచి తంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మంగాకుమారి, సర్పంచ్ మారెమ్మ, సీహెచ్‌వో రమణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు: చెక్కపల్లిలో 572 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కరీముల్లా, స్పెషలిస్టులు డాక్టర్ రవళి, డాక్టర్ ప్రవీణ్ వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యవసర చికిత్స నిమిత్తం నలుగురిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయగా, 100 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 44 మందికి కళ్ళజోళ్ళు అవసరమని నిర్ధారించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీవో పద్మావతిదేవి తనిఖీ చేశారు. ఎంపీటీసీ రమాదేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client Miryala Srinivasa Vara Prasad, S/o. late. Venkata Rama krishnarao, resident of D. No. 20-130, Main Road, Nuzvid town and mandal, Krishna district, now Eluru district, the following notice issued as follows :- My clients states that M/s Sri Lakshmi Srinivasa Developers & Constructions, Nuzvid , Reg. No. 153/2020 rep. by its Managing partners 1. Pagadala Satyanarayana, S/o. late. Vinayakarao, 2. Jorige siva Vara Prasad, S/o. Late. Haribabu of Nuzvid town and mandal, Krishna district, informed to my client that they are the absolute owners having exclusive, peaceful possession and enjoyment of below mentioned schedule properties, ie., an extent of 568.33 Sq. yards of house site bearing Plot No. 12 and an extent of 484.02 Sq. yards of house site bearing Plot No. 13 of L.P. No. 50/2021/1071/ APCRDA/DPMS, situated in R.S. No. 817/1, 817/2A and 817/2B of Nuzvid town and mandal, Krishna district, now Eluru district, which is morefully set out and described as item Nos.1 and 2 of the below mentioned schedule properties. The above said persons offered to sell the schedule properties and my clients came forward to purchase the notice schedule property and entered into agreement of sale by paying token amount. My clients are hereby calling upon the public at large that if anybody have any claims, rights, charges etc., over the schedule property or anybody have objections in purchasing the schedule property by my clients from the above said vendors, to intimate their objections in written either to my clients or to me within a week of this notice. If no objections received from anybody it deems that the said property is undisputed property and my clients will proceed further and if any objections received after lapse of 7 days, the said objections would not bind the rights of my clients in any manner.

***SCHEDULE* Item No. 1:** An extent of 568.33 Sq. yards of house site bearing Plot No. 12 of L.P. No. 50 / 2021 / 1071 / APCRDA /DPMS,situated in R.S. No. 817/1, 817/2A and 817/2B of Nuzvid town and mandal, Krishna district, now Eluru district within the sub registry of Nuzvid, within the following boundaries :- East : Plot No. 11 of Layout plan. South : 40 Feet width Road. West : Plot No. 13. North : Site of M/s Sri Lakshmi Srinivasa Developers and constructions.

Item No. 2: An extent of 484.02 Sq. yards of house site bearing Plot No. 13 of L.P. No. 50/2021/1071/APCRDA/DPMS,situated in R.S. No. 817/1, 817/2A and 817/2B of Nuzvid town and mandal, Krishna district, now Eluru district within the sub registry of Nuzvid, within the following boundaries :- East : Plot No. 12 of Layout plan. South : 12 Meters width Road.West : Plot NO. 14 to some extent and Plot No. 15 to some extent North : Site of M/s Sri Lakshmi Srinivasa Developers and constructions .

Regards : **PALLAGANI RAMBABU**, Advocate
Nuzvid, Dt:27-02-2024 NUZVID. 9848153188



వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

నూజివీడు, ఫిబ్రవరి 27: నూజివీడు నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయి. మంగళవారం నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి నూజివీడు మండలంలో భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మీర్జాపురానికి చెందిన ఎంపీటీసీ, వైసీపీ మండల ఉపాధ్యక్షురాలు దండుబోయిన స్వర్ణకుమారి, ఆమె భర్త రవికుమార్ గ్రామ టీడీపీ నాయకుడు గోళ్ళ లోకేశ్వరరావు నివాసం వద్ద పార్థసారథి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. వీరితో పాటు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు.

రైతులపై మారణకాండ అమానుషం : హరనాథ్

చాట్రాయి, ఫిబ్రవరి 27: న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని ఆందోళన చేస్తున్న హర్యానా రైతులపై మారణకాండ సాగిస్తున్న మోదీ సర్కార్‌కి అధికారంలో కొనసాగే అర్హత లేదని సీపీఐ (ఎంయల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు డి. హరనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)తో కేంద్రం ఒప్పందాలు తీవ్ర నష్టం కలుగజేస్తాయని, ఈ ఒప్పందం వలన దేశీయ ఉత్పత్తులు దెబ్బతినటం, స్వదేశీ పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందన్నారు.

బలివే ఉత్సవాలకు ఏర్పాట్లు



ముసునూరు, ఫిబ్రవరి 27: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఐదురోజులుపాటు జరిగే మహాశివరాత్రి మహోత్సవాల ఏర్పాటుల్లో అధికారులు నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా స్వామి, అమ్మవారి ఆలయానికి, కల్యాణమండపానికి రంగులు వేసి శోభయమానంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళవారం బారికేడ్ల నిర్మాణ ప్రక్రియను దేవదాయ శాఖ అధ్వర్యంలో చేపట్టారు. ట్రాన్స్‌కో ఏఈ హేమసుందర్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ పనులు జరుగుతున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకల ఏర్పాట్లు చేసేలా నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఓటు హక్కుపై ఎన్‌ఆర్ఐ విద్యార్థుల స్పెషల్ డ్రైవ్

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 27: ఎన్‌ఆర్ఐ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ విద్యార్థులు కనసానపల్లిలో ఓటుహక్కు వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఇంటింటికి తిరిగి ఓటును దుర్వినియోగం చేయవద్దని, మీరు వేసే ఓటు దేశ, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది.

రహదారి నిర్మాణానికి చిన్నం వితరణ

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 27: ఆగిరిపల్లి మండలం సగ్గూరు గ్రామ యాదవుల బజారు మరమ్మతులు నిర్వహించటానికి, నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య రూ.40 వేలు అందించారు. దీంతో రహదారి నిర్మిస్తున్నారు.

ఉచిత వైద్యసేవలందిస్తా : డాక్టర్ వెంకట్రావు



కైకలూరు, ఫిబ్రవరి 27: పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తానని బీజేపీ నేత డాక్టర్ సీఎల్ వెంకట్రావు అన్నారు. మంగళవారం కైకలూరు రైల్వేస్టేషన్ సమీపాన రోగులకు ఉచితంగా వైద్యసేవలను అందించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. శిబిరంలో 60 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



యశ్వంత్ (ఫైల్)

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 27: ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు అతివేగం కారణంగా అసువులు బాసి కన్నవారికి కన్నీరు మిగులుస్తున్నారు. ఆగిరిపల్లిలోని ఎన్‌ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎదురుగా మంగళవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో విజయవాడ నుంచి నూజివీడు వెళుతున్న మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను ఎన్ఆర్ఐ కళాశాలలో సీఎస్ఈ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఆగిరిపల్లి మండలం నెక్కలం గ్రామ వాసి మచ్చా వెంకట్రావు కుమారుడు యశ్వంత్(19) తన బైక్‌తో ఢీకొన్నాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని స్థానికులు స్పందించి 108కి సమాచారమిచ్చి విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చనిపోయాడని ధ్రువీకరించారు. కళాశాల ఎదురుగా రోడ్డుకు స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల ఇలా జరిగిందని స్థానికులు అంటున్నారు. పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మార్చి 1 నుంచి మేరీ మాత ఉత్సవాలు



కలిదిండిలో ముస్తాబైన మేరీ మాత చర్చి

కలిదిండి, ఫిబ్రవరి 27 : కలిదిండిలో మేరీ మాత ఉత్సవాలను మార్చి 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తామని విచారణకర్త బంటుమిల్లి యోహాను తెలిపారు. మార్చి 1న సమష్టి దివ్య పూజా బలి సమర్పణ, జపమాల, మేరీ మాత ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 2న సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రార్థనలు, 3న జపమాల, తదితర పూజలు భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. విజయవాడలో గుణదల మేరీ మాత ఉత్సవాల అనంతరం కలిదిండిలో వైభవంగా మేరీ మాత ఉత్సవాలు నిర్వహిస్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారు. భక్తులకు తాగునీటి కోసం ట్యాంకర్లు సరఫరా చేస్తున్నామని సర్పంచ్ మారుతీ ప్రసన్న తెలిపారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

బిందుశ్రీకి కామినేని అభినందన



కైకలూరు, ఫిబ్రవరి 27: స్కాలర్‌షిప్‌కు ఎంపికైన బోడావుల బిందుశ్రీని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అభినందించారు. రాచపట్నం గ్రామానికి చెందిన బోడావుల ఎలిషారాజు కుమార్తె బిందుశ్రీ భీమవరం విష్ణు కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. స్కాలర్‌షిప్ కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపడంతో ఇటీవల 14వ ఏజీఎస్ గ్రహంబెల్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఈ స్కాలర్‌షిప్ అవార్డును అందుకుంది. విషయం తెలుసుకున్న కామినేని వరహాపట్నంలోని తన స్వగృహంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఆమె విద్యాభివృద్ధికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు పేరిచర్ల ప్రసాదరాజు, పైడిపాటి శివశంకర్, వేంపాటి విష్ణురావు, కట్టా వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన



కైకలూరు, ఫిబ్రవరి 27: ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు నిధులను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కైకలూరు సీఏన్నార్ గార్డెన్ నుంచి దానెగూడెం మంచినీటి చెరువుకు వెళ్లే కెనాల్‌కు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ జయమంగళతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

మండవల్లి, ఫిబ్రవరి 27: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పెరికెగూడెంలో వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అలాగే రక్తదానం చేయవలసిన అవసరం, దాని వల్ల కలిగే లాభాలు, క్షయ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ పొందిన కళాకారులు వీధి నాటకం ద్వారా ప్రజలకు అర్థమయ్యే రీతిలో పాటలు, నాటికల ద్వారా హాస్య సన్నివేశాలతో ప్రదర్శన నిర్వహించారు. కళాకారుల బృందంలో ఎం. శేఖర్‌బాబు, వై. వీరయ్య, వై. రవితేజ, ఎం. చిరంజీవి, ఎం. ప్రసాద్, ఎం. కుమార్ వివరించారు.

గూడెం సభకు వెళ్లేందుకు శ్రేణుల సమాయత్తం

ముదినేపల్లి, ఫిబ్రవరి 27 : తాడేపల్లిగూడెంలో బుధవారం జరుగనున్న తెలుగుదేశం - జనసేన ఉమ్మడి బహిరంగ సభకు ముదినేపల్లి మండలం నుంచి రెండు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు. ముదినేపల్లి నుంచి 50 కార్లతో ర్యాలీగా తాడేపల్లిగూడెం వెళ్లేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, నియోజకవర్గ పార్టీ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు పోకల కృష్ణ తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి : ఎంఈవో

కలిదిండి, ఫిబ్రవరి 27 : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఎంఈవో ప్రభాకర్ బాబు వంటలు ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం పేట కలిదిండిలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్నారు. మెనూ ప్రకారం 132 మందికి వంట చేయగా, 106 మంది విద్యార్థులు మాత్రమే హాజరు ఉందన్నారు. 26 మంది అబ్సెంట్‌లో ఉన్నారన్నారు. విద్యార్థుల హాజరు శాతం మెరుగు పర్చాలన్నారు. మధ్యాహ్న భోజనంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, ఫిబ్రవరి 27 : మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో జరగనున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 345 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈ పరీక్షా కేంద్రంలో ప్రభుత్వ కళాశాల నుంచి 83 మంది, స్థానిక వీఆర్ కళాశాల నుంచి 105 మంది, వికాస్ జూనియర్ కళాశాల నుంచి 157 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి తెలిపారు. పరీక్షల నిర్వహణకు కళాశాలలో 11 గదులను ఏర్పాటు చేశామని, 12 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ నాగేశ్వరరావు వ్యవహరిస్తారు. ఎస్ఐ డి.వెంకట్ కుమార్ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.